# జల దిగ్బంధం



- చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి
- ప్రధాన రహదారిపై కల్వర్టుల వద్ద ప్రవాహంగా మారిన వరద నీరు
- జలమయంగా మారిన లోతట్టు ప్రాంతాలు
- నివాసపు ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు
- ఎత్తిపోస్తూ ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మళ్ళీ కోనారెడ్డి చెరువు కట్టకు ఏర్పడిన బుంగలు
- ఇదే పరిస్థితి గతంలో చరిత్రను సృష్టించింది
- ఒక్కసారిగా చెరువు కట్ట తెగి సుమారు 2వేల ఎకరాల ఆయకట్ట మింగేసింది
- వేసిన పంటలతో పాటు నీటిలో పొలాలు కొట్టుకుపోయి ఎడారిగా మారింది
- సహాయక చర్యలు చేపడతామన్న ప్రభుత్వం చేతులెత్తేసింది
- నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ధర్నాలు చేసిన నాయకులు విసుగెత్తారు
- చివరకు నష్టపోయిన రైతులకు పైసా ఆర్థిక సహాయం అందలేదు
- మరోసారి చెరువు కట్ట బుంగ పడేసరికి వ్యవసాయ రైతులంతా వణికిపోతున్నారు
- పరిస్థితుల ప్రభావం పరిశీలించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి
- తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు









**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 1,(జర్నలిస్ట్ వార్త):** ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరంగల్ జిల్లా జల దిగ్బంధంగా మారింది. చెరువులు, కుంటలతో పాటు లోతట్టు ప్రాంతాలు పొంగిపొర్లుతున్నాయి. భారీగా వరద నీరు ప్రవాహంగా మారి ప్రధాన రహదారులను జల దిగ్బంధం చేశాయి. వరంగల్ ఖమ్మం ప్రధాన ప్రధాన రహదారి పంతిని శివారులోని కల్వర్టు వద్ద వరద నీరు ప్రయాణికులను కొంత సమయం పాటు ఇబ్బందికి గురి చేసింది. ఇలా ప్రతీ మార్గంలో కల్వర్టుల వద్ద వరద నీటి ప్రవాహానికి ప్రయాణం కష్టంగా మారింది. అలుపెరుగని రీతిలో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు మొత్తం జలమయ్యంగా మారాయి. గ్రామీణ ప్రాంతాలలో నివాసకు ఇల్లులు వరదనీటితో మునిగిపోయి, ప్రజలు కష్టాలు పడుతుంటే గ్రామపంచాయతీ వారు చొరవ తీసుకుని మిషనరీల సహాయంతో వరద నీటిని దారి మళ్లించే ప్రయత్నాలు కొనసాగించారు. గ్రామంలోకి చేరిన వరద నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లే విధంగా మిషనరీల సహాయంతో కృషి చేశారు. గ్రామ పంచాయతీ వారు చేపట్టిన ప్రయత్నానికి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కొంతమేర ఉపశమనం కలిగిందని చెప్పవచ్చు.

### కోనారెడ్డి చెరువు కట్టకు మళ్ళీ బుంగ పడింది

వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కోనారెడ్డి చెరువు కట్ట మళ్లీ బుంగబడిన పరిస్థితి చోటుచేసుకుంది. రైతులు తెలిపిన ఆధారంగా చెరువు కట్టకు రెండు చోట్ల బుంగ పడినట్లు ఆరోపిస్తున్నారు. గతంలో మాదిరిగానే పరిస్థితి తయారయిందని వ్యవసాయ రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో పరిస్థితి అంటే అంత ఇంత కాకుండా చరిత్రను సృష్టించింది. దాదాపుగా కోనాపురం చెరువుపై 2 వేల ఎకరాల ఆయకట్టగా వ్యవసాయ అధికారులు నిర్ధారించారు. చెరువు కట్టకు గతంలో బుంగపడి కట్ట తెగిపోయింది. దాదాపుగా 7 వందల ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు నీరంతా ప్రవాహంలా మారి ఒక్కసారిగా 2 వేల ఎకరాల వ్యవసాయ సాగును మింగేసింది. వరంగల్, ఖమ్మం ప్రధాన రహదారిపై ఉన్న సంగేపు వాగు వద్ద వంతెన కుప్ప కూలిపోయింది. ఆ సమయంలో ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. రాకపోకలకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి, బ్రిడ్జి పనులు హుటాహుటన కొనసాగించింది. ఒక్క రోజులోనే ఆటంకంగా మారిన రాకపోకలను సజావుగా జరిగేలా చర్యలు చేపట్టింది. జలమయం కారణంగా నష్టపోయిన రైతులపై అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రాకపోకలపై ఉన్నదృష్టి అన్నం పెట్టే రైతన్నపై లేకపోయింది. వరద ప్రవాహానికి వేసిన పంటలతో పాటు పంట పొలాలు సైతం కొట్టుకుపోయాయి. మరోసారి వ్యవసాయం చేయడానికి వీలు లేకుండా ఆ ప్రాంతమంతా ఎడారిగా మారింది.

నష్టపోయిన పంటలపై ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో సర్వే ప్రారంభించింది. సర్వే ఆధారంగా సంబంధిత నివేదికను తయారుచేసి వ్యవసాయ అధికారులు ఉన్నతాధికారులకు సమర్పించారు. నష్టపోయిన రైతులకు గత ప్రభుత్వం ఏదైనా ఆర్థికంగా సహకరిస్తూ ఆదుకుంటుందని, ఎదురుచూసిన రైతులకు ఒక్క పైసా సహాయం అందించకుండా ప్రభుత్వం చేతులెత్తేసింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలంటూ రాజకీయ పార్టీల నేతలంతా ప్రధాన రహదారిపై ధర్నాలు చేశారు. పలుమార్లు రైతుల పక్షాన ధర్నాలు చేసి, ఎలాంటి ఫలితం లేకపోవడంతో రాజకీయ పార్టీల నేతలు అలసిపోయి విసుగెత్తారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోతుందని నిరుత్సాహానికి గురైన వారు జరిగిన ఘటనను కొద్ది కొద్దిగా మర్చిపో సాగారు.

ప్రస్తుతం అదే పరిస్థితి చోటు చేసుకోవడం మరోసారి వ్యవసాయ రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చెరువు కట్ట తెగిపోయి పంట పొలాలు ధ్వంసమ రైతులు కంటతడి పెట్టుకున్నప్పటికీ

గత ప్రభుత్వం కాస్తయినా కనకరించలేదని వాదన ఉంది. ఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించిన గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు వారం రోజుల లోపు తిరిగి చెరువు కట్టని పునర్నిర్మిస్తామని హామీలు ఇచ్చి వెళ్లిపోయారు. సంవత్సరాలు గడిచినప్పటికీ రింగ్ బాండ్ పనులు పూర్తిగాకపోవడంతో పలు విమర్శలు తలెత్తాయి. నూతనంగా నిర్మించిన కట్ట మరోసారి బుంగ పడి ఆ రైతులను భయపెట్టే పరిస్థితి చోటు చేసుకోవడంతో వారి జీవితాలతో ప్రభుత్వమే ఆటలాడుతూ ఉందని ఆరోపణలు చేస్తున్నారు. చెరువు కట్ట బుంగ బడి రైతులు నష్టపోయే పరిస్థితి రాకముందే సంబంధిత అధికారులు కట్ట సామర్థ్యాన్ని పరిశీలించి జాగ్రత్త చర్యలు చేపట్టాలి కదా..? నీటిపారుదల శాఖ అధికారులు కేవలం కార్యాలయాల కె పరిమితమై కాలయాపన చేయడం వల్ల ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.




### ప్రజల కష్టాలపై పర్యటించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ జిల్లా కలెక్టర్

వరంగల్ జిల్లా పరిధిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జిల్లా ప్రజలు పడుతున్న కష్టాలపై ఎంపి కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి పర్యటించారు. లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరి ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా తామే పరిశీలించారు. అనంతరం వర్ధన్నపేట కోనారెడ్డి చెరువు కట్ట బుంగ పడిందన్న సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని చేరుకుని కట్ట పరిస్థితి పై ఆరా తీశారు. చెరువు కట్ట వద్ద ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా జాగ్రత్త చర్యలు తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కురిసిన అకాల వర్షాలకు ఎస్సీ కాలనీ పూర్తిగా వర్షపు నీటితో మునిగిపోయింది. ప్రస్తుతం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు ఆ పరిస్థితుల్లో కాలనీవాసులను పరామర్శించి, నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు మరోసారి అదే పరిస్థితి తలెత్తడంతో సమాచారం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఎస్సీ కాలనీలోని పరిస్థితులను పరిశీలించారు. ఇళ్లల్లోకి చేరిన వరద నీరు దిగువ ప్రాంతాలకు పంపించే విధంగా సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.










# నల్లబెల్లిలో డ్రైనేజీ క్లియర్ పనులు







వర్ధన్నపేట, సెప్టెంబర్ 1,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో ఆదివారం భారీ వర్షం కురిసిన నేపథ్యంలో డ్రైనేజీలు కూరుకుపోయాయి. గ్రామ పంచాయితీ కార్యదర్శి షేక్ హుస్సేన్ తమ సిబ్బందితో కలిసి గ్రామంలోని డ్రైనేజీలను ప్రారంభించారు. గ్రామంలోని వెటర్నరీ హస్పటల్ వద్ద వర్షపు నీరు ఎస్సీ కాలనీ వైపు వస్తుండగా ఆ నీటిని తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు అత్యవసరమైతే తప్ప, బయటికి రాకూడదని అన్నారు. వాతావరణానికి అనుగుణంగా గ్రామస్తులు తమ నివాసపు ఇళ్ళచుట్టు పరిశుభ్రత పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రైనేజీ సమస్య తలెత్తకుండా ముందస్తుగా పనులు ప్రారంభించిన కారోబార్ బిర్రు సుధాకర్ ని కార్యదర్శి హుసేన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రభాకర్, బాబు, బొందయ్య, సత్యం, పూలమ్మ, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

# నేడు విద్యా సంస్థలకు సెలవు

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి

వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 1,(జర్నలిస్ట్ వార్త): భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు ఈ నెల 2వ, తేదీన (సోమవారం) సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు విధిగా ఈ ఆదేశాలను పాటించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతో విద్యా సంస్థలకు ముందస్తుగానే సోమవారం సెలవు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 14వ, తేదీన 2వ, శనివారం సెలవు దినము కాగా ఆ రోజున అన్ని విద్యాసంస్థలు పని దినంగా పనిచేస్తాయని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలి

**- సంబంధిత అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రుల సూచన**







వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 1,(జర్నలిస్ట్ వార్త): భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, మునిసిపల్ కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా మున్సిపల్, విద్యుత్, వైద్యారోగ్య, రెవెన్యూ శాఖల యంత్రాంగం మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, జాగ్రత్త వహించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. రిజర్వాయర్ల గేట్లు ఎత్తుతున్న క్రమంలో ప్రాజెక్టుల దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. వరంగల్ కాలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, సిపి అంబర్ కిషోర్ ఝా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**సమస్యలో చిక్కుకున్న ప్రయాణికులు**

# సురక్షిత ప్రాంతానికి చేర్చిన వరంగల్ జిల్లా కలెక్టర్



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 1,(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం అలుగులో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు చిక్కుకున్నారు. ఆదివారం సమాచారం తెలుసుకున్న వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తక్షణమే వెంకటాపురం వెళ్లి ప్రయాణికులను సురక్షితమైన ప్రాంతానికి చేర్చేలా చర్యలు చేపట్టారు. ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను లారీలో ఎక్కించుకొని, సురక్షితమైన ప్రాంతానికి తరలించడంపై డ్రైవర్ ను అభినందించారు. ప్రయాణికుల యోగక్షేమాలు తెలుసుకొని, వారిని మండల ప్రజా పరిషత్ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి సురక్షితంగా చేర్చారు. ప్రయాణికులకు అవసరమైన వసతులు, భోజనం సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి చేర్చడంలో సహాకరించిన రెవిన్యూ, పోలీసు అధికారులు, గ్రామ ప్రజలను కలెక్టర్ అభినందించారు.

# భారీ వర్షాలకు నివాసపు ఇళ్లు కూలిపోయింది

**- ఇద్దరు వ్యక్తులకు గాయాలు - క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి**






రాయపర్తి, సెప్టెంబర్ 1,(జర్నలిస్ట్ వార్త): గత మూడు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలో శనివారం నివాసపు ఇళ్లు కూలిపోయిన ఘటన చోటు చేసుకుంది. జరిగిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం ప్రకారం కాట్రపల్లి గ్రామానికి చెందిన గుర్రపు సమ్మయ్య రేకుల ఇళ్లు కురిసిన వర్షానికి గోడలు నాని ఇళ్లు కూలీ పోయింది. ఆ ఇంట్లో సమ్మయ్య తోపాటు ఇంటి పక్క వ్యక్తి యాకూబ్ చేతికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించాలంటే గ్రామస్తులకు కష్టంగా మారింది. చింతల చెరువు మత్తడి వద్ద వర్షపు నీరు ఉద్రిక్తం కావడంతో అంబులెన్స్ రాకపోకలు ఇబ్బందిగా మారు అంబులెన్స్ దూరంగా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు స్ట్రక్చర్ సాయంతో యాకుబ్ ను మత్తడి దాటించి ఆసుపత్రికి తరలించారు. కురిసిన వర్షాల కారణంగా నివాసపు ఇళ్లు కూలిపోయి ఆసుపత్రి పాలైన నిరుపేద వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# అత్యవసరమైతే తప్ప బయటికి రావోద్దు

**- పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ ఝాన్సీరెడ్డి**




రాయపర్తి, సెప్టెంబర్ 1,(జర్నలిస్ట్ వార్త): ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. అకాల వర్షాల కారణంగా జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని సూచించారు. భారీ వర్షాల కారణంగా ముంపు గురైన కిష్టాపురం, మైలారం, పోతిరెడ్డిపల్లి, గ్రామాలలో పర్యటించి బాధితులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. అనంతరం మండలంలోని శివరాంపురం గ్రామంలో వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై విరిగిన చెట్లను అధికారుల సహాయంతో రోడ్డు ప్రక్కకు తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బారి వర్షాల నేపథ్యంలో ఎవరు బయటకు రావద్దని అన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ గ్రామాలలో ప్రజలకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఏదైనా ప్రమాదకర పరిస్థితితులు ఎదురైతే సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వెంట తహశీల్దార్ ఎం శ్రీనివాస్, ఎంపీడీవో జి. కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, ఈరెడ్డి నర్సి%శీ%హ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.